
రహదారిని కమ్మేసిన చెట్లకొమ్మలు



పాలకుర్తి: బసంత్‌నగర్ విమానాశ్రయ ప్రతిపాదిత స్థలం మూలమలుపు నుంచి రాజీవ్‌నగర్ మీదుగా బసంత్‌నగకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా చెట్లకొమ్మలు ఏపుగా పెరిగి రహదారిని కమ్మేశాయి. రహదారికి ఒకవైపు ఎస్సారెస్పీ కాలువ ఉండగా మరోవైపు ఏపుగా పెరిగిన కొమ్మలతో రాత్రివేళల్లో ప్రయాణం భయానకంగా మారింది. అంతేకాకుండా రోడ్డుపై ఏర్పాటు చేసిన వీధిదీపాలు కూడా వెలగడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలో పేరుకుపోయిన చెత్త



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురంలో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో మురికినీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. రామగుండం నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుకు అడ్డుగా విద్యుత్ స్తంభం



సుల్తానాబాద్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌కి వెళ్లే రహదారికి అడ్డుగా విద్యుత్ స్తంభం ఉండడంతో కూరగాయలు కొనేందుకు వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఎండీ ఫహీమ్ కుమార్తె పర్వీన్ వివాహానికి హెల్పింగ్‌హ్యాండ్స్ టీం సభ్యులు ఆదివారం రూ.32,525, క్వింటాల్ బియ్యం అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ టీం మహిళా అధ్యక్షురాలు నారగోని సరిత, సతీశ్‌గౌడ్, కోలేటి చంద్రశేఖర్, మచ్చగిరి రాము, కొయ్యడ సతీశ్, బొజ్జ సాగర్, మల్లారపు అరుణ్‌కుమార్, ఎండీ యూసుఫ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి అండగా నిలుస్తాం



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ చేపడుతున్న అభివృద్ధి పనులకు అండగా నిలుస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. స్థానిక 26వ డివిజన్‌లో కూల్చివేసిన భవనం వద్దకు ఆదివారం వచ్చి సంఘీభావం ప్రకటించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండి రోడ్డు విస్తరణకు నోచుకోక ఉన్న భవనాన్ని కూల్చివేయడంపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు గుంపుల తిరుపతి, డివిజన్ ఇన్‌చార్జి దాసరి సాంబమూర్తి, నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, కాల్వలింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేశ్, ముస్తఫా, దాసరి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇప్టా వార్షికోత్సవం



జెండా ఎగురవేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) 83వ వార్షికోత్సవాన్ని ఆదివారం స్థానిక భాస్కరరావుభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేశారు. నాయకులు కె.స్వామి, మద్ది ఎల్లాగౌడ్, కె.కనకరాజ్, గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, వై.లెనిన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రోడ్డు పనులు



ఓదెల: మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద స్థానిక నాయకులు ప్రారంభించిన రోడ్డుపనులు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో ఉప్పరపల్లె నుంచి గోపరపల్లె వరకు రోడ్డు పనులు వేగవంతం చేశారు. స్థానిక నాయకులు చిలుక హరికాంత్, పల్లె రాజన్న, శ్రీనివాస్, రమేశ్ ఉన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

ముత్తారం: బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయలని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ కోరారు. ముత్తారంలో ఆదివారం నిర్వహించిన బీసీ మేలుకొలుపు రథయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ఎక్కువ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. క్యాతం మహేందర్, బండ నిఖిల్, ముత్తారం మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, మండల సర్పంచుల మాజీ కన్వీనర్ నూనె కుమార్, బీసీ మండల అధ్యక్షుడు చల్ల సమ్మయ్య పాల్గొన్నారు.

రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి

మంథని: ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ మేలుకొలుపు రథయాత్ర ఆదివారం మంథని నుంచి మల్హర్ మండలం కొయ్యూరుకు వెళ్లింది. బీసీ ఉద్యమాన్ని ప్రతీ పల్లెలో బలోపేతం చేస్తమని పేర్కొన్నారు.

సింగరేణి వార్తలు

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



సర్టిఫికెట్లు అందజేస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో జీఎం పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. పిల్లలకు వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో 25రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని జీఎం ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు చేపట్టామని పేర్కొన్నారు. నాయకులు రవీందర్, అధికారులు ధనుంజయ, జనార్దన్, వంశీధర్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోజూ స్విమ్మింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉంటాం



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతీరోజు స్విమ్మింగ్ చేయడంతో పాటు ఆటలు ఆడితే ఆరోగ్యంగా ఉంటామని సింగరేణి ఆర్జీ–2 జీఎం వెంకటయ్య అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌తో పాటు అధునాతన సదుపాయాలతో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ కోర్టులను ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సింగరేణి కార్మిక ఉద్యోగుల పిల్లలతో పాటు సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఐటీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ సెక్రటరీ రవీందర్, డీజీఎం సివిల్ ధనుంజయ్, జనార్దన్, డీవైపీఎం వంశీధర్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, కోఆర్డినేటర్ పోశం, సంతోష్, శ్యామ్‌సన్, సాంబశివరావ్ పాల్గొన్నారు.

అధికారి కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3లో సంక్షేమాధికారిగా పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందారు. కాగా అతడి కుటుంబానికి ఆదివారం చెక్కు అందజేశారు. ఓసీపీ–3 ప్రాజెక్టు కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుడి కుటుంబానికి చెక్కు అందజేశారు. ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్, మేనేజర్ భారత్‌కుమార్, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ నర్సింహులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• అదుపుతప్పి ట్యాంకర్ బోల్తా

సుల్తానాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని సుగ్గాంపల్లి వద్ద గల రాజీవ్ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున డ్రైవర్ నిద్ర మత్తుతో అదుపుతప్పి ట్యాంకర్ బోల్తా పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రి నుంచి రామగుండం వైపు వెళ్తున్న కెమికల్ ట్యాంకర్ లారీ అదుపుతప్పి బోల్తా పడగా ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో

• ఉచిత వైద్యశిబిరం

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ నాలుగో డివిజన్ కృష్ణానగర్‌లో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ షుగర్, బీపీ, 2డి ఎకో, కంటి పరీక్షలు చేశారు. 100మందికి ఆస్పత్రి డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. భరత్ అండ్ టీం సభ్యులు బొడిగె భరత్ గౌడ్, మహేశ్వర్‌రెడ్డి, వొల్లాల సురేశ్, మహేందర్ గౌడ్, నాగరాజు, మారుతి పాల్గొన్నారు.

• ఎన్టీపీసీ పీటీఎస్‌లో రోడ్డు ప్రమాదం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డుకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని గుర్తింపు సంఘం కార్యాలయం ఎదురుగా గల రోడ్డుపై సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మండల్ తన బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి కారులో వస్తున్న విఘ్నేష్ బైక్ ఢీకొన్నాడు. దీంతో మండల్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ధన్వంతరి ఆస్పత్రిలో చేర్పించారు. యూనియన్ కార్యాలయం వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

• విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

మంథని: మంథని మండలం గద్దలపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు ఇండ్ల సది ఎద్దు మేత కోసం వెళ్లగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని రైతు వాపోయాడు.

• లక్ష్యాలకు అనుగుణంగా బోధన చేయాలి

రామగుండం: ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని, రానున్న విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల అభ్యసన స్థాయి లక్ష్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేపట్టాల్సిన అవసరం ఉందని అంతర్గాం ఎంఈవో ఏకాంబరం అన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా ఐదురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల పరిధిలోని ఉపాధ్యాయులు హాజరుకాగా, మెరుగైన సామర్థ్యాలు కనబరిచిన ఉపాధ్యాయులు కవితాదేవి, స్వప్న, స్వర్ణ, రాజును సన్మానించారు.

కేజీబీవీల్లో ఇంటర్ కోర్సులు



రామగిరి కేజీబీవీ భవనం

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసింది. ఈ నేపథ్యంలో 2025–26 సంవత్సరానికి ఎంఎల్‌టీ, కంప్యూటర్ సైన్స్‌లను జిల్లాలోని రామగిరి, పాలకుర్తి కేజీబీవీల్లో ప్రవేశపెట్టినట్లు డీసీడీవో కవిత తెలిపారు.

వసతి.. నాణ్యమైన విద్య

కస్తూరిబా విద్యాలయాల్లో వసతితో పాటు నాణ్యమైన విద్య అందిస్తుండడంతో వాటిలో విద్యార్థినులు చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కేజీబీవీల్లో ఇంటర్ అమలవుతుండగా సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్ఏ ఫిమేల్) కోర్సులను ప్రవేశపెట్టింది. రామగిరి, పాలకుర్తి కేజీబీవీల్లో ఎంఎల్‌టీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టారు. అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీసీడీవో పేర్కొన్నారు.

మహాసభ విజయవంతం చేయండి

కమాన్‌పూర్: హైదరబాద్ ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 27న నిర్వహించే ఆటో ఆకలి కేకలు మహాసభ విజయవంతం చేయాలని మండల కేంద్రంలో ఆటో స్టాండ్ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మట్ట నర్సయ్య, కందుల నర్సింగం, సదానందం, జంగాపెల్లి తిరుపతిరెడ్డి, రెడ్డి శేఖర్, కాస రవి, సుంచు శ్రీనివాస్, బొంపల్లి ఓదెలు, దీకొండ రమేశ్, నీర్ల స్వామి, ఆడెపు సారయ్య, ముకీద్, అఫ్జల్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సివిల్ జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: కార్పొరేట్ సివిల్‌జీఎంగా పనిచేసి ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న టి.సూర్యనారాయణను ఆదివారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సన్మానించి జ్ఞాపిక బహూకరించారు.

వృద్ధాశ్రమం సందర్శన



సన్మానిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమాన్ని ఆర్ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ రాజహంస సందర్శించారు. ఆశ్రమంలో వృద్ధులకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ్ రాజహంస మాట్లాడుతూ వృద్ధులకు చివరి దశలో సేవలందించేందుకు ఈశ్వర వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఆర్ఎఫ్‌సీఎల్ డీజీఎం రమేశ్ ఠాకూర్, హెచ్‌ఆర్ డీజీఎం సోమనాథ్ సంకె, ఆశ్రమ నిర్వాహకుడు పి.టి స్వామి, జి.సత్తయ్య, సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలకగా స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దాపూర్ బీఆర్ఎస్ నాయకులు ఆయనను సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, నాయకులు తొగరు శ్రీనివాస్, పూరెల్ల గంగయ్య, కృష్ణమూర్తి, బుర్ర మహేశ్, తోట వెంకన్న, నర్సింహచారి, నవీన్ ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



రామగిరి: రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన అనుముల జగన్‌ను ఆదివారం బుధవారంపేటకు చెందిన పీఆర్ ఫౌండేషన్ ఫర్ సొసైటీ వెల్‌నెస్ అండ్ ఎంపవర్‌మెంట్ ప్రతినిధులు సన్మానించారు. పీఆర్ ఫౌండేషన్ ఫౌండర్ పొనంపల్లి రవి, ఎండీ కాటిపెల్లి శ్రీనివాస్, లాయర్లు, వలీంటర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సుల్తానాబాద్‌రూరల్: 2004-05 బ్యాచ్..



కమాన్‌పూర్: 1996-97 బ్యాచ్ విద్యార్థులు



యైటింక్లయిన్‌కాలనీ: ఉపాధ్యాయులతో 2005-06 పూర్వ విద్యార్థులు



గోదావరిఖనిటౌన్: 2000-01 బ్యాచ్.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2004–05లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు రాంకిషన్‌రావు, శ్రీనివాస్, జగత్‌పాల్, భారత్‌కుమార్, చంద్రమౌళి, లక్ష్మీనారాయణ, జ్యోతిని సన్మానించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన 2005–06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులను సత్కరించారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక గాంధీనగర్‌లోని గీతాంజలి పాఠశాలలో 2000–01 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు స్థానిక శ్రీనగర్‌లోని సాయిలీల బాంకెట్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి హెడ్‌మాస్టర్ కంది రవీందర్‌రెడ్డిని పూర్వ విద్యార్థులు సత్కరించారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1996–97లో పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని కేఎస్ ఫంక్షన్ హాల్లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

ఎంపీగా గెలిపించిన మంత్రిపై విమర్శలు చేస్తారా?



మాట్లాడుతున్న కోట రవీందర్‌రెడ్డి

రామగిరి: ఎంపీ టికెట్ ఇప్పించి తన నియోజకవర్గంలో సుమారు 50వేల మెజార్టీ తెప్పించి గెలిపించిన మంత్రి శ్రీధర్‌బాబుపై చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కుటుంబం విమర్శలు చేస్తుందా? అని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సెంటినరికాలనీ శ్రీపాదభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరస్వతి పుష్కరాల్లో ఫ్లెక్సీలో ఎంపీ వంశీకృష్ణ ఫొటో ఏర్పాటు చేయలేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుపై ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తించొద్దన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న మంత్రిపై నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికారు. సెంట్రల్ సెక్రటరీలు గడ్డం తిరుపతి, ఎల్లంకి రామారావు, రాజ్‌కుమార్, బ్రాంచ్ సెక్రటరీ సమ్మయ్య, సాయికృష్ణ, పిట్ సెక్రటరీలు మనోహర్, కిషన్‌నాయక్, సదానందం, కొమురయ్య, శ్రీనివాస్‌రావు, జుబేర్, సుధాకర్ పాల్గొన్నారు.

రైతులకో విశిష్ట సంఖ్య

• కేంద్ర పథకాల అమలులో ఇదే కీలకం




కాట్నపల్లిలో వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

సుల్తానాబాద్: అన్నదాతలకు విశిష్ట సంఖ్యతో కార్డు ఇచ్చి పథకాల అమలుకు అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న 54 రైతువేదికల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఆన్‌లైన్ చేపట్టారు. వ్యవసాయ అధికారులు 'అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ ఈ రిజిస్ట్రీ'లో రైతుకు ఉన్న భూముల వివరాలు నమోదు చేస్తున్నారు. రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో రైతువేదికలో ఏఈవోల ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఆన్‌లైన్ పూర్తయిన వెంటనే 11 అంకెల ప్రత్యేక సంఖ్య (యూనికోడ్) కేటాయిస్తారు. జిల్లాలో 1,61,032 మంది రైతులు ఉన్నారు. ఈనెల 5 నుంచి రిజిస్ట్రీ ప్రక్రియ ప్రారంభం కాగా, జూన్ 6వ తేదీలోగా రైతుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కాగా ఆధార్‌కు అనుసంధానంగా ఉన్న సెల్‌నంబర్ లేక, ఓటీపీ చెప్పకపోవడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతుల వివరాలు నమోదు చేయడంలో ఏఈవోలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటి వరకు నమోదు ప్రక్రియ 15శాతం పూర్తయినట్లు అధికారులు చెప్తున్నారు. అయితే రానున్న వానాకాలంలో పీఎం కిసాన్ యోజన కింద అందించే పెట్టుబడి సాయాన్ని ఈ కార్డు ప్రాతిపదికనే చెల్లించనున్నట్లు డీఏవో ఆదిరెడ్డి పేర్కొన్నారు.

రజకసంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేశ్

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన బొడ్డుపల్లి సురేశ్ రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. జిల్లా అధ్యక్షుడు రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మూర్తి ఆదివారం నియామక పత్రం అందజేశారు. రజకుల అభివృద్ధికి, సంఘం తోడ్పాటుకు సురేశ్ పాటుపడతాడన్న విశ్వాసంతో ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

ప్రొటోకాల్‌పై ప్రశ్నిస్తే కుటుంబంపై నిందలా?



మాట్లాడుతున్న మల్లికార్జున్

గోదావరిఖని: సరస్వతి పుష్కరాల సందర్భంగా పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను ప్రొటోకాల్ ప్రకారం గౌరవించలేదని అడిగితే ఆ కుటుంబంపై నిందలు వేస్తారా అని కాంగ్రెస్ నాయకుడు పి.మల్లికార్జున్ ప్రశ్నించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుష్కరాలకు రావాలని ఎంపీకి కనీసం ఇన్విటేషన్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. దేవాదాయ శాఖ ఆఫీసర్లను ప్రశ్నిస్తూ పలు చోట్ల కాంగ్రెస్ లీడర్లు కార్యక్రమాలు చేశారే తప్ప.. ఎక్కడా మంత్రి శ్రీధర్‌బాబు పేరును ప్రస్తావించలేదన్నారు. నాయకులు కోటేశ్వర్లు, పాకాల గోవర్ధన్‌రెడ్డి, కామ విజయ్, తిప్పారపు మధు, మల్లేశ్‌యాదవ్, వాసర్ల సురేందర్, ఎండీ రఫీక్, మాదాసు విజయ్, రాజేందర్ పాల్గొన్నారు.